పంటలపై అడవిపందుల దాడి

- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



వెంకూర్‌లో చలిమంట వేసుకుని పంటకు కాపలా ఉన్న రైతు



కుంటాలలో వరిని ధ్వంసం చేసిన అడవిపందులు

కుంటాల: ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న పంటలను అడవిపందులు ధ్వంసం చేస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. విత్తనం విత్తినప్పటి నుంచి పంట అమ్ముకునే వరకు పడే కష్టం ఒక ఎత్తయితే.. మరోవైపు అడవి జంతువులు గుంపులుగా వచ్చి పంటలపై దాడి చేస్తుండటంతో దిగుబడి మరింత తగ్గే ప్రమాదం ఉంది. ఓవైపు అకాల వర్షాలు, చీడపీడలతో నష్టం జరుగుతుంటే.. మరోవైపు అడవిపందులు కర్షకులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ముప్పేట దాడి..

కుంటాల మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 12,450 ఎకరాల్లో పత్తి, 6,620 ఎకరాల్లో సోయా 3,320 ఎకరాల్లో వరి, 1,650 ఎకరాల్లో మొక్కజొన్న, 330 ఎకరాల్లో కందులు సాగు చేశారు. ప్రస్తుతం మొక్కజొన్న, సోయా పంటలు చేతికి రాగా రైతులు విక్రయించుకున్నారు. అయితే వరి కోత దశకు చేరుకోగా.. చేనులోంచి పత్తిని తీస్తున్నారు. దీంతో వరి పొలంతోపాటు పత్తి చేన్లను అడవి జంతువులు ధ్వంసం చేస్తున్నాయి. గుంపులుగుంపులుగా వచ్చి పొలంలో తిరుగుతూ పత్తి కాయలను కొరికి పారేస్తున్నాయి. మండలంలోని అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తుందన్న విషయం తెలియడంతో రైతులు భయాందోళన చెంది అటు వైపు వెళ్లడం లేదు. మండలంలోని అంబకంటి, దౌనెల్లితండా, కుంటాల, అంబుగామ, మెదన్‌పూర్, సూర్యాపూర్, అంబకంటితండా శివారులో ఉన్న వరి, పత్తి పంటలను అడవి పందులు ధ్వంసం చేయడంతో దిగుబడులపై ప్రభావం చూపింది. నష్టపోయిన పంటను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాత్రి కాపలా..

పంటలను అడవి జంతువులు ధ్వంసం చేస్తుండటంతో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు చేల వద్దనే జాగారం చేస్తున్నారు. చలి మంటలు, మంచెలు ఏర్పాటు చేసుకొని కాపలాగా ఉంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి..దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నష్టపరిహారం అందించాలి



నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగుచేసిన. ఇటీవల అడవి పందులు చేనుపై దాడి చేయడంతో తీవ్రంగా నష్టపోయా. పత్తి మొక్కలు చనిపోయాయి. అధికారులు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.

– జాదవ్ కృష్ణ, దౌనెల్లితండా

దిగుబడులు తగ్గుతున్నాయి..



పంటకు చేతికివచ్చే సమయంలో అడవిపందులు ధ్వంసం చేస్తుండటంతో దిగుబడులు మరింత తగ్గుతున్నాయి. కొందరు రైతులకు పెట్టుబడులు వచ్చేలా లేవు. అడవిపందుల దాడిలో అరఎకరం పంట నష్టపోయా. మిగతా దిగుబడి సగానికి తగ్గింది.

– తోట రాఘవేందర్, కుంటాల

సర్వే నిర్వహిస్తాం..

ఇటీవల ఆయా గ్రామాల్లో అడవి జంతువులు పంటలను ధ్వంసం చేస్తున్నాయనే విషయం మా దృష్టికి వచ్చింది. అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తాం. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దు. రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం.

– వేణుగోపాల్, ఎఫ్ఆర్వో

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ అహ్మద్‌కు ఎస్టీయూటీఎస్ ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ సర్వే నిర్వహణలో తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు బీవీ రావు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

నేడు మునిపెల్లిలో వైద్యశిబిరం

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ ఆదిత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, స్వర్ణ హాస్పిటల్ నిర్వాహకురాలు అయిండ్ల స్వర్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే శిబిరంలో వైద్యపరీక్షలు చేసి.. మందులు అందిస్తామని పేర్కొన్నారు. శిబిరంలో ఆర్థో వైద్య నిపుణులు ప్రమోద్ చంద్రారెడ్డి, కార్డియాలజీ నిపుణులు జగన్నాథం, వైద్యులు శశాంక్‌రెడ్డి, మానస, వసుకుమార్, కిరణ్, అన్వేష్, గిరీష్ పాల్గొంటారని .. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో ఒకరి మృతి



రవీందర్ (ఫైల్)

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధి మధురనగర్ కాలనీకి చెందిన ఖానాపూర్ గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు నిమ్మగడ్డం రవీందర్‌శర్మ(57) శనివారం హఠాన్మరణం చెందాడు. రాజురాలో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వంటపనులు చేశాడు. శనివారం ఒక్కసారిగా అస్వస్థతకు గురవగా.. కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గతంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా పని చేశారు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ రాజ్యలక్ష్మీ సహిత లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసంలో దీపాలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పూజారి నరసింహస్వామి తదితరులు ఉన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామం నుంచి భైంసాకు శుక్రవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా వాహనంలో తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేశామని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

భైంసాటౌన్: మండలంలోని మహాగాం గ్రామంలో మహదేవ్ మందిర్ వరకు రూ.రెండు లక్షలతో సీసీ రోడ్డు, ముధోల్ మండలంలోని ఎడ్‌బిడ్‌లో రూ.11లక్షలతో మల్లన్న ఆలయం వరకు సీసీ రోడ్డు, రూ.9 లక్షలు డ్రైయినేజీ పనులకు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ తెలిపారు. శనివారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో గ్రామస్తులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు.

వీసీని కలిసిన భాస్కర్



వీసీని సన్మానిస్తున్న భాస్కర్

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీ నూతన వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌ను పీసీసీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు అనుముల భాస్కర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు.

చేపపిల్లలు పంపిణీ

కుంటాల: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం మత్స్యకారులకు చేపపిల్లలు పంపిణీ చేశారు. మండలంలోని 29 చెరువుల్లో వదిలేందుకు మత్స్యకారులకు సుమారు 8,05,200 చేప పిల్లలను అందించినట్లు మత్స్యశాఖ ఫీల్డ్ అసిస్టెంట్ గయాసొద్దీన్ తెలిపారు. గోవర్ధన్, రాజేశ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఓలా గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నిర్ణీత తేమశాతం వచ్చాక ధాన్యాన్ని తీసుకురావాలని రైతులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు పిప్పెర వెంగళరావు, జీవి రమణారావు, శేఖర్‌రావు, ఎగ్గం గజ్జారాం, హైమద్‌పాషా, సుదర్శన్ పటేల్, ఎగ్గం నర్సింలు, నాలం మహేందర్, రజాక్, నిర్వాహకులు వెంకటేశ్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమం



ఓలాలో పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్

సారంగాపూర్: ఈనెల 10వరకు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 1జనవరి, 2025నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నూతన ఓటరు నమోదు తోపాటు జాబితా మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల్లోగా ఓటుహక్కులేని వారు వచ్చి ఓటరుగా నమోదు చేయించుకోవాలని తెలిపారు.

కుంటాల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం, ఆదివారం ఓటర్ల జాబితా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, డీటీ నరేశ్‌గౌడ్, ఆర్ఐలు అడెల్లు, రాజేశ్వర్ తదితరులు పరిశీలించారు.

తానూరు: మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల్లో 53 నూతన ఓటరు నమోదు కోసం దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ లింగంమూర్తి సూచించారు. శనివారం తానూరులో ఓటరు నమోదు కేంద్రం పరిశీలించారు. అనంతరం తానూరులో ఓటరు నమోదు కేంద్రం తనిఖీ చేశారు. మిగిలిన వారు ఆదివారం ఆయా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ మోహన్‌సింగ్, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

కుంటాల: మండలంలోని కల్లూరు–కుంటాల రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను ఎస్సై భాస్కరాచారి ఆధ్వర్యంలో శనివారం పోలీసులు ట్రాక్టర్‌తో తొలగించారు. వాహనదారులు అదుపు తప్పే వెంకూర్ వద్ద రోడ్డుపై ఉన్న మట్టిని తీసివేయించారు. రోడ్డుపై పంట ఉత్పత్తులను ఆరబెట్టవద్దని.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని ఎస్సై కోరారు.

'మాదిగలంతా ఏకం కావాలి'



టీఎన్జీవో సంఘ భవనంలో సమావేశమైన జిల్లా కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: పార్టీలు, సంఘాలకు అతీతంగా మాదిగలు ఏకం కావాలని మాదిగల వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు నిగులపు లింగన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అధిక జనాభా మాదిగలున్నప్పటికీ వివిధ సంఘాలు, అగ్రకుల పార్టీలతో పలుచనవుతున్నట్లు వాపోయారు. త్వరలో కమిటీ నిర్ణయం తీసుకొని ప్రణాళిక ప్రకారం గ్రామాల్లో చైతన్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు కోరిపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు అడిగ లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘ నాయకులు మురళీకృష్ణ, శ్రీనివాస్, కొలగని రాజు, శనిగారపు రవి, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా సభ్యులు రవీందర్, శ్రీనివాస్, భూమేశ్, దశరథ్, బొబ్బిలి భీమేశ్, నిగులకు సాయన్న, ప్రవీణ్, సుధాకర్ పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. శనివారం పట్టణంలో అమరవీరులకు పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. భూమి కోసం భుక్తి కోసం దేశ ప్రజల విముక్తి కోసం సాయుధపోరాటంలో అసువులు బాసిన అమరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దుర్గం లింగన్న, గోనె స్వామి, గుజ్జుల గజ్జన్న, ప్రసాద్, సత్తన్న, శ్రీనివాస్, గంగన్న తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్‌కు దూరం ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

లోకేశ్వరం: విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరం ఉండి.. చదువుపై దృష్టి సారించాలని ఎస్సై అశోక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో గడుపుతూ తాత్కాలిక ఆనందం పొందకుండా.. శాశ్వత ఆనందం కోసం పుస్తకాలతో కుస్తీ పట్టాలని విద్యార్థులకు సూచించారు. ఆకతాయిలు వేధిస్తే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌతమ్, అధ్యాపకులు విఠల్, చిన్నయ్య, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, హరీశ్, ప్రమీలరాణి, నవీన్, మహేందర్, సాయినాథ్ ఉన్నారు.

నిర్మల్‌లో వైభవంగా శోభాయాత్ర

- నేటి నుంచి శ్రీ వైష్ణవ ఆయుత చండీ అతిరుద్ర మహాయాగం



శోభాయాత్రలో స్వరూపానంద సరస్వతి స్వామీజీ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలో ఆదివారం నుంచి శ్రీ వైష్ణవ ఆయుత చండీ అతిరుద్ర మహాయాగం ప్రారంభించనున్నారు. లోకకల్యాణం కోసం విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు ఈనెల 10 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో శనివారం సాయంత్రం నిర్మల్‌లోని బోయవాడ సమీపంలో ఉన్న దక్షిణముఖ హనుమాన్ ఆలయం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన మహాయాగశాల వరకు శోభాయాత్ర నిర్వహించారు. రథంలో శ్రీకష్ణుడి మూలవిరాట్టును అలంకరించగా భక్తులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. శ్రీశ్రీ శ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద సరస్వతి స్వామీజీ ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. 15 రోజులపాటు ప్రతీరోజు హోమాలు, యజ్ఞాలు, కల్యాణమహోత్సవాలు, అభిషేకాలు, విశేషార్చనలు, రుద్రకుంకుమార్చన, కోటిబిల్వార్చనలు, దీపోత్సవాలు, సహస్త్ర కలశాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు కొనసాగుతాయి. చివరిరోజు ఆయుత చండీ అతిరుద్ర మహాయాగంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

విజయవంతం చేయాలి

ఖానాపూర్: ఇంటింటి సర్వేను ప్రజలు విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్ కోరారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనకబడ్డ కులాలకు సంక్షేమఫలాలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. అధికారులు, సిబ్బందికి ప్రజలు అందుబాటులో ఉండి వివరాలు తెలిపి సహకరించాలని కోరారు.

ఊరూరా ప్రారంభమైన కుటుంబ సర్వే

- తొలిరోజు వివరాలు సేకరించిన ఎన్యూమరేటర్లు



కనకాపూర్‌లో సర్వే వివరాలు అడుగుతున్న డీటీడబ్ల్యూవో అంబాజీ



దస్తురాబాద్ : భూత్కూర్‌లో సర్వే పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌గౌడ్



బాసరలో సర్వే పరిశీలిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైంది. ఈనెల 6నుంచి మూడురోజులు ఇంటింటికీ స్టిక్కర్లు అతికించిన ఎన్యూమరేటర్లు.. శనివారం నుంచి మళ్లీ వారు స్టిక్కర్లు అతికించిన ఇళ్లకు వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. కనకాపూర్‌లో చేపడుతున్న సర్వేను మండల ప్రత్యేకాధికారి, డీటీడబ్ల్యూవో అంబాజీ పరిశీలించారు. ప్రజలు సైతం ఎన్యూమరేటర్లకు సహకరించి.. వివరాలు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

బాసర: బాసర మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన సర్వేను ఎంపీడీవో అశోక్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మమ్మాయి రమేశ్ పరిశీలించారు. సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. అంతకుముందు ప్రతి ఇళ్లకు స్టిక్కర్ అతికించారు.

దస్తురాబాద్: గ్రామాల్లో సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్ గౌడ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు సర్వే ఫారాలు అందించారు. అనంతరం భూత్కూర్‌లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఎంపీవో రమేశ్‌రెడ్డి, కార్యదర్శులు రాజశేఖర్, అనిల్, రమేశ్ ఉన్నారు.

'పోరాటంతోనే పాత పెన్షన్'

ఖానాపూర్: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఐక్యమత్యంతో పోరాడి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించుకుంటామని ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న కృష్ణారావు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. సీపీఎస్ సాధనే లక్ష్యంగా తాను 2025లో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలువనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెవెన్యూ ఉద్యోగి కాశవేని రమేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం గఫార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రూ.45 వేలు, బంగారం చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై రవీందర్

కుభీర్: మండలంలోని సొనారి గ్రామంలో సూర్యవంశీ దేవ్‌రావ్ ఇంట్లో దొంగలు పడి రూ.45వేల నగదు, రూ.25వేల విలువైన ఐదు మాసాల బంగారం చోరీ చేసినట్లు ఎస్సై పి.రవిందర్ తెలిపారు. సూర్యవంశీ దేవ్‌రావ్ తన ఇంటికి తాళం వేసి శుక్రవారం ఉదయం బెల్గాంలో ఉన్న బంధువుల ఇంటిలో శుభకార్యంలో పాల్గొనేందుకు వెళ్లాడు. అదే రోజు రాత్రి తాళం పగులగొట్టిన దొంగలు బీరువాలో ఉన్న నగదు, బంగారం దోచుకెళ్లారు. ఉదయం ఇంటి పక్కన ఉన్న స్వప్న దేవ్‌రావ్.. సూర్యవంశీకి ఫోన్ చేసి చోరీ విషయం తెలియజేశారు. ఇంటికి వచ్చి దేవ్‌రావ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త వార్తలు

గౌడజన హక్కుల పోరాట సమితి జిల్లా న్యాయ సలహాదారునిగా రమణ

లక్ష్మణచాంద: గౌడజన హక్కుల పోరాట సమితి న్యాయ సలహాదారునిగా మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన దమ్మగౌని రమణగౌడ్ ఎంపికయ్యారు. జిల్లా కార్యవర్గంలో జిల్లా న్యాయసలహాదారుడిగా రాష్ట్ర కమిటీ నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన దశాగౌడ్‌ని ఉపాధ్యక్షుడిగా నియమించారు. తమకు చోటు కల్పించిన రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ గౌడజన సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మోకుదెబ్బ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చంద్రశేఖర్

మామడ: గౌడ్‌జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మండలంలోని న్యూలింగంపల్లికి చెందిన పాకాల చంద్రశేఖర్ గౌడ్ ఎన్నికయ్యారు. గతంలో టీడీపీ, టీఆర్ఎస్ పార్టీల్లో మామడ మండల కన్వీనర్‌గా పని చేసి చురుకైన కార్యకర్తగా గుర్తింపు పొందాడు.

మాజీ మంత్రి అల్లోల పరామర్శ

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎ.ప్రకాశ్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రావు, రాంచందర్, మాణిక్‌రెడ్డి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

బాసర: మండల కేంద్రంలోని శారదనగర్, లాబ్ది గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బాసర కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శనివారం భైంసాలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బోస్లే నారాయణరావు పటేల్‌ను కలిసి విన్నవించారు. నీటి సమస్య, సీసీ రోడ్డు, డ్రైయినేజీ కాల్వ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరగా.. నారాయణరావు పటేల్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ముధోల్: మండల కేంద్రంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో పని చేస్తున్న నర్సయ్య కుమారుడు బ్లడ్ క్యాన్సర్ వ్యాధిని జయించాడు. చికిత్స కోసం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోస్లే నారాయణ్‌రావు పటేల్ రూ.25వేలు ఆర్థికసాయం అందించగా.. శనివారం ఆయనను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా సహస్రార్జున జయంతి

ఖానాపూర్: పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పట్కరి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సహస్త్రార్జున జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా సహస్త్రార్జున చిత్రపటానికి పూలమాలలు వేశారు. సంఘం అధ్యక్షుడు అల్జాపూర్ గంగామోహన్, సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్‌టౌన్, నిర్మల్‌రూరల్, సోన్, లక్ష్మణచాంద, దిలావర్‌పూర్, నర్సాపూర్, మామడ మండలాలకు చెందిన 289 మంది లబ్ధిదారులకు రూ.2.89 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో మండల అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.